ఈ రోగముగలవారు చాలా బలహీనముగ యుందురు. శరీర యంత్రము పనిచేయుటకు అవసరమైనంత ఉష్ణశక్తి వీరిలో ఉత్పత్తికాదు. వీరి పైత్యకోశము బలహీనపడియుండును. తద్వారా జఠరాగ్ని మందగించి అజీర్ణము, తిన్నది వంటబట్టకపోవుట, మలబద్ధము, మూత్రబద్ధము మొందుగా ఏర్పడి క్రమముగా అనేక బలహీనతలు ప్రారంభమగును. పాండురోగము, రక్తహీనత కూడా వీరికి క్రమేణా సంప్రాప్తము కావచ్చును. వీరి వ్యాధినివారణకు సూర్యోపాసన, ఉపవాస చికిత్స, మర్దన చికిత్స యోగవ్యాయమ సాధనలు, వాయుధారణ, సులభముగ జీర్ణమై దేహమును బలపరచే ఆహారపదార్థముల స్వీకరణ అవసరము. వైద్యుని రోగి తరచు సంప్రదించుచు ఆయన ఇచ్చు సలహాలను పాటించుచుండవలసి యుండును.

ఈ వ్యాధి ముదిరినచో చివరకు ఊపిరితిత్తులు కూడా బలహీనపడి అక్షరమాలలో చివరివ్యాధియగు క్షయ కూడా సంప్రాప్తము కావచ్చును.

క్షయ :

ఈ రోగమునకు ఉపశమనము ఎక్కువగా ప్రకృతి వైద్యములోనే లభించును రోగి స్థితిగతుల ననుసరించి చికిత్సలు నిర్ణయింపబడును. పొడి గాలిగల ఆరామ ప్రాంతములలో చేయబడు చికిత్సలు వీరికి ఎక్కువగా సహాయపడును.

మధుమేహాము - అతిమూత్రము :

ఇవి లివరు, పాంక్రియాసు జీర్ణాశయము, బలహీనమైనందువలన ప్రారంభమగు వ్యాధులు. ఆయా అవయవములకు చేయబడు పాంచ భౌతిక చికిత్సల ద్వారాను, యోగవ్యాయామ సాధనల ద్వారాను ఈ అవయవములు బలపడి రోగము అదుపులోనికి తేబడును. అతిమూత్రము కూడా వీనికి సంబంధించిన వ్యాధియే. దీనిలో తిన్న ఆహారము పులిసిపోయి మూత్రి కామ్లముగా తయారై ఎక్కువగా మూత్రము ద్వారా బయటికి వెళ్ళిపోవు చుండును. అందువలన రోగి నీరసపడును ఇంకా ఎక్కువగా తినుచు రోగ పీడితుడగుచుండును.

ఈ రెండు వ్యాధులకు ఆహారనియమము అత్యవసరము. దినచర్య లోని నియమపాలనము వీరికి బాగా సాయపడును.

అండవాతము, ప్రేగుజారుట :

అండవాతములో వృషణములలోనికి మూత్రము మూత్రాశయము ద్వారా చేరును. అట్లు చేరుటకు మూత్రాశయ కండరములలో రంధ్రములు ఏర్పడుట ఒక కారణము. ఆ పరిస్థితిని చక్కబరచుటకు వృషణములలోనికి చేరిన మూత్రమును తిరిగి మూత్రాశయములోనికి తెప్పించుటకు కొన్ని ప్రకృతి చికిత్సలు పనిచేయును. వానిలో వేడినీటి కాపడము, తడిపట్లు, తైల మర్దనలు, ఆసనములు ఆహార నియమములు తొట్టిస్నానములు వగైరా. ఈ చికిత్సలు చేయించుకొనలేనివారు వీనికి ఆపరేషను చేయించుకొందురు. ఆటు తర్వాత తిరిగి ఆదే రోగపరిస్థితి ఏర్పడకుండా తగుజాగ్రత్తలు వారు తీసి కొనవలసి యుండును. అందులకు ఆహార విహారములలో నియమములు అవసరమగును. వానిని వైద్యుని సలహాపై పాటించ వలసియుండును. దీనిని హైడ్రోసిల్ అని ఇంగ్లీషులో పిలుతురు.

ఇటువంటిదేయగు ప్రేగు జారుటను "హెర్నియా" యందురు. ఈ వ్యాధిలో ప్రేవులలో మలము మురిగి దుష్టవాయువు లేర్పడినందువలన ప్రేవు ఉబ్బి పొత్తికడుపు క్రిందిభాగమునగల గజ్జలవద్దకు దిగును. ఇది ఒక్కొక్కప్పుడు పెరిగి చాలా బాధను ప్రమాదమును కలిగించును. దీనికి కూడ ఆపరేషను చికిత్సగా ఉపయోగింతురు ఆపరేషను తరువాత మళ్ళీ ఆదేవ్యాధి వచ్చుటకు అవకాశముండవచ్చు. కాబట్టి దుష్టవాతమును కలిగించే వాత పదార్థములగు పప్పులు, దుంపకూరలు, పెరుగు, మాంసాహారములు తినకుండా రోగి జాగ్రత్త పడవలెను.

దీని నివారణకు కూడా ప్రకృతి చికిత్సలలో అండవాతమునకు నిర్ణయించబడిన చికిత్సలను అప్పటి అవసరమునుబట్టి మరికొన్ని చికిత్సలను వైద్యుని సలహాతో చేయవలసివచ్చును.

బోదకాలు.

ఇదికూడా అండవాతమువంటి వ్యాధే. దీనిని ఫైలేరియాయని పిలుతురు. ఆహార విహార లోపమువలన ప్రేవులలో చేరిన దోషములు క్రమముగా రక్తప్రసరణలోనికి చేరును. అవి ఊపిరితిత్తులలో సరిగా శుద్ధికాకపోతే గుండెద్వారా ఆ కలుషరక్తము శరీరమంతటికి ప్రసరించును. ఆ దోషములు ఏఏ అవయవములకు ప్రాకి, అచట స్థిరపడితే ఆ అవయవములు రోగగ్రస్తమగును. అవి శిరస్సునకు ఎక్కుటవలన శిరోవ్యాధులు ఏర్పడును. గుండె, ఊపిరితిత్తులు, లివరు మున్నగు ప్రాణావయవముల చెంతచేరితే శరీరమునకు ఎక్కువ అపకారము జరుగును. కాబట్టి దేహయంత్రము దానిని నాలుగు బహిష్కార అవయవములద్వారా సాధ్యమైనంత ఎక్కువ దోషములను బయటకుపంపి మిగిలినదానిని తక్కువ ప్రమాద స్థలమగు కాళ్ళవైపునకు నెట్టును. అది తొడలు, పిక్కలు అటుతరువాత పాదములకు చేరును. పాదములు, పిక్కలు బాగా ఉబ్బి భయంకరముగ

కన్నదును. కాని ఈ రోగములో ప్రాణావయవములు ప్రమాదమునందు ఉండా దోషాలు దూరమునకు చేర్చబడును. గాన దీర్ఘకాలము, ప్రాణాపాయము లేనట్టి రోగిష్టి జీవితమును రోగి గడుపుతూ యుంటాడు. ఈ వ్యాధికి ప్రకృతి చికిత్స మరీ మామూలే. నైష్టిక దినచర్య, ఆహార విహార నియమములు, మర్దన, యోగాసన, వాయుధారణా సాధనలు, సూర్యకిరణ జల చికిత్సలు.

కీళ్ళ వాతము.

ఇది దుష్టవాత ప్రభావమువలన కలుగు వ్యాధి దుష్టరుధిరముకూడా కొంతభాగం దుష్టగాలితోపాటు కీళ్ళలో చేరి బాధలు కలిగించుచుండును. అవి, సీలమండలు, మోకాళ్ళు, నడుము, మోచేతులు, భుజములు, మెడ, మణికట్లు మున్నగు ప్రాంతములు. దీనికికూడ ముఖ్య కారణము ఆహార విహారముల లోని లోపములే దీని నివారణచర్యకూడా మామూలే ధార్మిక దినచర్య, శీతోష్ణ ప్రయోగములు, మర్దన, సూర్యకిరణ చికిత్సలు వగైరాలు. కండరముల వాపు వాతముకూడ ఇటువంటిదే.

పక్షవాతము :

ఇది ఈ రెండు వ్యాధులకంటే తీవ్రమైనది దీనిలో దుష్టవాత ప్రభావమువలన నాడీమండలము, కండల మండలము ఎక్కువగా బలహీనపడి చచ్చుపడును. ముందుగా దేహములోని కుడి భాగముగాని, ఎడమ భాగము గాని చచ్చుపడును. వ్యాధి తీవ్రమైనకొలది అన్ని భాగములకూ అది వ్యాపించును దీనికికూడ చికిత్స ధార్మిక దినచర్యతోపాటు మర్దన చికిత్స, సూర్యకిరణ, జల, చికిత్సలు, ఆహార నియమములు వగైరాలే.

రాచకురుపు (క్యాన్సరు) :

ఇది శరీరము బాగా రోగగ్రస్తమైనపుడు వచ్చు వ్యాధి. శరీరములో ఎ ఒక భాగము ఎక్కువ బలహీనపడగా అచట దోషములు ఎక్కువగాచేరి

నిల్వయుంచి క్రమముగా ఆ దోషము శరీరమున కంతటికిని ప్రాకి చివరకు ప్రాణాపాయస్థితికి చేర్చును. ఇది చికిత్సకు కష్టసాధ్యమైన వ్యాధి. దీనికి తాత్కాలిక ఉపశమన చికిత్సలు ఇతర వైద్యములలో కొన్ని గలవు. అంత కంటే క్షేమకరమైనవి ప్రకృతి చికిత్సలే అయితే ఇవికూడ ఈ రోగమును పూర్తిగా కుదర్చలేవు. కాని బాధలు తగ్గించి రోగి స్థిమితముగా ఆయువు ఉన్నంతకాలమూ బ్రతికి అనాయాస మరణము పొందుటకు ఇది సహాయ పడగలదు.

ఉన్మాదము.

ఇది మానసికవ్యాధి దీనికి ప్రధాన కారణము సాంఘిక అవ్యవస్థ, దుష్టాహార విహారములు. యువతీ యువకులలో దీని ప్రభావము మెల్లగా స్థిరపడి క్రమముగా పెరిగి ముదురును. దీనికి సరియైన చికిత్స ధార్మిక దిన చర్య వివిధ ప్రకృతి చికిత్సలు. ఇవి ప్రకృతి వైద్యుని సలహాతో రోగి పరిస్థితినిబట్టి నిర్ణయించబడును. ఆధ్యాత్మిక చికిత్సలు, సూర్యోపాసన వగైరా బాగా సహాయపడును.

పైత్యకోశవ్యాధులు - కామిలా, గంజు వగైరా .

వీనికి కూడా దినచర్యలోని నియమపాలన, విశ్రాంతి చాలా అవసరము. వేడిచేయు పదార్థములు ఈ రోగముగల వారికి నిషిద్ధము. వారి ధాతుశక్తి ననుసరించి తగు చికిత్సలను వైద్యుడునిర్ణయించును.

ఉబ్బసము: ఈ వ్యాధి గలవారు శ్లేష్మరహిత, ఉష్ణఉత్పాదక ఆహారములను తీసికొనుచు శ్వాసకోశ వ్యాయామములు, సూర్య నమస్కారములు చేయుచు, తగినంత విశ్రాంతి తీసికొనవలసియుండును.

గుండె జబ్బులు :

ఈ వ్యాధులుగల వారికి ఆహారనియమము, తగినంత విశ్రాంతి, మానసిక ఆందోళనలు తగ్గించే సత్సంగ గోష్ఠులు ధార్మిక దినచర్య, సూర్యో పాసన ఉపకారము చేయును.

అధిక రక్తపుపోటు :

ఈ వ్యాధి లక్షణములు గలవారి గుండె అధికముగ కొట్టుకొని రక్తమును ధమనుల ద్వారా బాగా స్పందింపచేయును. ఇందు ధమనులలో దోషములు చేరుటవలన అవి ఇరుకు అగుట, ముడుచుకొనిపోవుట జరుగును. వీరు శ్లేష్మకర ఆహారములు, అతిగా వాడుట ఉప్పు తినకుండా తగినంత విశ్రాంతి తీసుకొనుచుండవలెను. యోగాసనాలు చేయవచ్చును,

చర్మ వ్యాధులు :

వీని నివారణకు తైలమర్దన చేసుకొని ఎండలో తిరుగుట, యోగ వ్యాయామము చేయుట అమ్లకరములగు ఆహారములను తినకుండుట, కత్తి నూనెలు వాడకుండుట మంచిగాలిని ఎక్కువగా పీల్చు సాధనలు చేయుట అవసరము. మట్టిపట్టీలు ఈ వ్యాధినివారణకు చాలా సాయపడును.

కుష్ఠ వ్యాధి :

ఇది అతిదీర్ఘ వ్యాధి, దీని నివారణకు సూర్యోపాసన, మృత్తికా స్నానము., సాత్వికాహారము, ధార్మిక దినచర్య, చాలా సహాయపడును. మాంసాహారము, చేపలు, పొగత్రాగుట మద్యపానము వగైరా దురభ్యాసములను రోగి మానవలెను.

సుఖరోగములు - (గనేరియా, సవాయి వగైరా) :

ఇవి చికిత్సకు కష్టసాధ్యవ్యాధులు. ఇవి ప్రకృతి చికిత్సవలన కొంత వరకు ఉపశమింపవచ్చును. "రంకురోగములకు రసపుమందులే గతి" అనే ఒకసామెత గలదు. దానిని నమ్మి చాలమంది రసపుమందులు సేవించి తరుణ రోగములను కాలికము చేసుకుంటూ యుంటారు. తద్వారా తీవ్రమగు చర్మవ్యాధులు, చివరకు కుష్ఠుకూడా వచ్చే అవకాశము గలదని వైద్యులు చెప్పుతూ యుంటారు. ఈ వ్యాధులకు వివిధరకముల ప్రకృతి చికిత్సలు పనిచేయగలవు. అవి వైద్యునిచే నిర్ణయింపబడి పర్యవేక్షింపబడుచుండును.

మలబద్ధము - అతిసారము.

ఇవి మలకోశ సంబంధమైన బలహీనవ్యాధులు. ఆహారసంస్కరణ, ఉపవాస చికిత్స, ఎనిమా, మర్దన, యోగవ్యాయామ సాధనలు ధార్మిక దినచర్య వీని నివారణకు సాయపడును.

రోగాద్వైతము - చికిత్సా ద్వైతము

ఆరోగ్యము ఒక్కటే. అట్లే రోగముకూడా ఒక్కటే. ఆ ఒకేరోగము అనేక అవతారములుదాల్చి, అనేక వేషములు, భాషలు, నటనలు బాధలు మున్నగు వాటితో కలిసి ప్రజలపై సవారి చేయుచున్నది. వీనికన్నింటికి అనేకపేర్లు పెట్టుట కొందరు వైద్యులకు అలవాటు సరదాకూడాను. అది తప్పనిసరి అంటారు వారు. అది వారి పాండిత్య ప్రకర్షకు గీటురాయి. అయితే ఈ ద్వైతభావన ఆందోళనతో కూడినదే. రోగములకు కారణము అస్వాభావిక జీవనము దాని నివారణకు తగినచికిత్స, స్వాభావిక జీవనమే.

ఈ సత్యము అందరికీ తెలిసినా దానిని ఆచరణలో పెట్టగలిగిన 'రు మాత్రము సమాజములో చాలా కొద్దిమంది యున్నారు. రోగములతో బాధ పడుట చాలా వ్యయప్రయాసకరము. రోగములు తెలిసిగాని తెలియకగాని చేసిన పాపములవలనను, వాతావరణ దోషములవలనను, దైవయోగము వలనను తటస్థించును. కాబట్టి వ్యాధి నిరోధము కష్టసాధ్యమైనట్టిదే. అయితే ప్రజలు సాధ్యమైనంతవరకు ఆహార విహార నియమములలోగల లోపములను సవరించుకొనుచు వికృతి శక్తులకు సన్నిహితము కాకుండా, దూరమై ప్రకృతిశక్తుల దరికి చేరవలసి యున్నది. ఇదియే మంచి తరణో పాయము.

ఈ జగన్నాటక రంగము అంతా మాయాస్వరూపమై యున్నది. "రోగములు వచ్చిన తరువాత చికిత్సలుచేసి అవస్థలు పడుటకంటే రోగములు

రాకుండా చేసికొనుటకు ప్రయత్నించుట శ్రేష్టతర సాధన" అని పలువురు పెద్దలు హితబోధచేస్తూ యుంటారు. అది సత్యమే అయినా రోగములు అనివార్యమైనపుడు, ప్రమాదవశాత్తు వచ్చినపుడు, వానికి చికిత్సలు చేయక తప్పదు. ఇందుకొరకే అనేక రకముల వైద్య విధానములు అనేక రకముల రోగులకు ఉపశాంతి కలుగచేయుటకు అవతరించినవి. రోగముల పేర్ల సంఖ్యను హెచ్చవేతలతో పెంచుతూ వానినే స్మరిస్తూ యుండుటకు సహాయ పడేది వికృతి విజ్ఞానము. దీనిపై కొందరికి అభిమానము ఉండవచ్చు. అభిమానము లేనివారుకూడా కొందరు ఉండవచ్చు.

ఆరోగ్యము, అనారోగ్యము అను రెండూ చీకటి, వెలుగు వంటివి ఒకటి ప్రవృత్తికాగా రెండవది నివృత్తి అగును. ఈ రెండూ జీవిత మను గడకు అవసరమైనవే ఆరోగ్య భాగ్యాభిలాషులు వీని స్వరూప స్వభావము లను గమనిస్తూ జాగరూకులై జీవించవలసి యున్నది.

ప్రకృతి వైద్య ఉపచార చికిత్సలు

ఉపచార చికిత్సలు రెండు ప్రధాన స్వభావములుగలవిగ గుర్తింపబడు చున్నవి వానిలో మొదటిది స్వావలంబన చికిత్స. దీనిని ప్రతివారును తమంతటతామే ఇతరుల సహాయము అవసరము లేకుండానే చేసుకొన గలిగియుండును రెండవది ఇతరుల సహకారముతోనే చేసికొనగలిగియుండును. ఇది సహకారచికిత్స యనబడును.

ఈ రెండూ కొందరికి అవసరమైనవే కాని స్వావలంబన చికిత్సకు వ్యయప్రయాసలు తక్కువ. సహకార చికిత్సకు వ్యయప్రయాసలు ఎక్కువ. ఎవరికివారు తమ స్థితిగతులను పరిశీలించుకొనుచు స్వావలంబన, సహకార చికిత్సా పద్ధతులలో తమకు అనుకూలమైన వానినే ఉపయోగించవలెను ఈ రెండు స్వభావములుగల వానిలో సహజ సాత్వికమైనది. మర్దన చికిత్స

మర్దన చికిత్సా విధానము

"మర్దనమ్ గుణవర్ధనమ్" అనే సూక్తిని అందరూ గుర్తించి విశేష గుణవంతులు కావలసియున్నారు. మర్దన, క్రియ, ప్రతిక్రియలతో కూడి యుండును. ఇవి రెండూ సహజసిద్ధ కర్మలు. ఆయా దేశకాలవ్యక్తి ప్రకృతులకు అనుకూలముగ మర్దన చికిత్సా పద్ధతులు పలురకములుగా నున్నవి. వానిలో ముఖ్యమైనవి పదహారు రకములు. ఏ ఏ అవయవముల కేయే విధానము అవసరమో గమనించుచు పాటించి అమలుపరచవలసియుండును.

1. ఉత్సాదనము లేక రుద్దుట (Rubbing) - సామాన్యముగా సర్వావయవముల మర్దనయందును ఇది ప్రథమ విధి దీనివలన రక్త ప్రసారము బాగుగా జరిగి చర్మరంధ్రములు వికసించును

2. ఘర్షణము లేక గట్టిగా రుద్దుట (Friction) ఇదియు సర్వావయవములకును ఉపయోగించుచు ఉత్సాదనా సంస్కారము ఘర్షణ మాచరించినచో శరీరమందలి మాలిన్యములు కదలి రక్తప్రవాహములోనికి చేరి శుద్ధియగును.

3 పీడనము లేక పిసుకుట (Kneading) .- వివిధావయవములను రెండు చేతులతో బాగుగా పిసుకుట వలన ఆయా భాగములందలి కండరముల లోని మాలిన్యములు బాగుగా బహిర్గతమొనర్చబడి ఆయా కండరముల యందలి బాధలుతగ్గి ఇవి బలపడును.

4. ఉద్వేష్టనము - పిండుట (Wringing) - ఇదికూడా కండరము లందలి మాలిన్యములను, బాధలను పోగొట్టుటకుపకరించు విధానమే. కండరమును రెండుచేతులతోను నొక్కి విరుద్ధ దిశలకు త్రిప్పుట. (గుడ్డను పిండినట్లు కండరమును పిండుట.)

5. ఆవేష్టనము :- తిగెచు Twisting ఒక వైపునకే త్రిప్పుట వలెనే ఇందు కండరమును ఒక్కొక్కసారి యొక్కొక్క దిశకే మెలిబెట్టవలసియుండును

6. మంథనము (చిలుకుట) Churning - కండరములను పెరుగు చిలుకునట్లు చిలుకుటచే యందలి మలినావరోధములు తొలగును.

7 ప్రహరణము - కొట్టుట (Percussion) :- ఈ విధానము సామాన్యముగా బల్లపరుపు కండరములకు లాభదాయకము. అఱచేతితో శరీర భాగములను, మృదువుగా కొట్టుటను ప్రహరణము అందురు.

8. ఆస్ఫాలనము Palming - ఇది అరచేతిని దొప్పవలె నుంచి శరీరమున మోతకలుగునట్లుచేసే ఉత్సాహ ప్రేరేపక ప్రక్రియ.

9. సంపుటకము Boxing - వివిధావయవములను పిడికిలితో గ్రుద్దుటను సంపుటక మందురు. ఇది మెత్తగానుండు ఏ శరీరభాగమున నైనను ఉపయోగపడును.

10. ఛేదనము లేక నరుకుట Hacking - అరచేతితో నిలువుగా నరుకునట్లు కొట్టుటను ఛేదనమందురు. ఈ విధానమును శరీరమందలి యన్ని భాగములందును అవలంబింపవచ్చును

11 వాదనము లేక వ్రేళ్ళతో కొట్టుట (Tapping) :- వ్రేళ్ళతో నిలువుగాగాని అడ్డముగాగాని కొట్టుటను వాదన యందురు. సామాన్యముగ శిరోభాగము, నుదురు, కణతలు వీటిని మర్దించునపుడీవిధానమవలంబింప బడును.

12 తాడనము లేక అరచేతితో కొట్టుట (Beating) - అరచేతితో చరచు విధానమును తాడనము అందురు. ఈ విధానముకూడ శిరస్సు, కణతల పట్టినయుండే సామాన్యముగా నవలంబింపబడుచున్నది.

13. పరిపీడనము లేక వ్రేలితో రుద్దుట - బొటనవ్రేళ్ళతో వలయాకారముగా నొక్కి రుద్దుటను పరిపీడన మందురు Fingering ఇది సామాన్యముగానుదురు, కణతలు, కీళ్ళు, వెన్నుపూసలు, మున్నగు కండరములు తక్కువగా గల భాగముల మర్దనయందవలంబింప బడుచున్నది.

14. సందాంశకము లేక తొనలు తీయుట (Pealing) - చర్మమును రెండు బొటనవ్రేళ్ళతో తొనలు వలుచునట్లు నొక్కిరుద్దువిధానముకూడ సామాన్యముగా పైవిధానమువలె కండరములు తక్కువగానున్న భాగముల మర్దనయందవలంబింపబడుచున్నది

15. సంధిచాలనము లేక కీళ్ళను కదుపుట (Joints movement) - సంధులు లేక కీళ్ళయందలి యవయవములను గుండ్రముగాగాని, పైకి క్రిందికిగాని, ప్రక్కలకుగాని బాగుగా కదిపి లేక లాగి యందలి బాధలను తొలగింపచేయుటను సంధిచాలనమందురు. ఇది మణికట్టు, మడిమలు, కాలి, చేతివ్రేళ్ళు, మోకాళ్ళు, మెడ, వెన్నుపూసలు ఇత్యాది వివిధ సంధుల యందలి పట్లను సడలించుటకై యవలంబింపబడు చున్నవి

16 హర్షకము లేక స్పందనము (Vibration) - వ్రేళ్ళను శరీరమునకు తగిలీ తగులనట్లుగా పైనుండి క్రిందకు కదుపు విధానమును హర్షకమందురు. ఇది వెన్నుపాములోగల నాడీ మండలమునకు వ్రేళ్ళచివర నుండి ప్రసరించు కొంతశక్తిని ప్రసరింపజేసి వాటియందు చైతన్యమును కొనివచ్చుటకై యవలబింప బడుచున్నది.

పైవిధి అనుభవజ్ఞుల ద్వారా బాగా నేర్చుకున్నవారే సరిగా మర్దన చికిత్స చేయగలరు. అదియే శ్రేష్ఠతమమగు చికిత్స యనబడును.

మర్దన చికిత్సా ఫలితములు :-

మర్దన చికిత్సవలన శరీరమునందలి సకలావయవములు చైతన్య వంతములగును. శరీరములోని శీత, ఉష్ణ, శక్తులను సమతూకములో నుంచుటకు ఇది బాగా సాయపడును. శీతకాలములో చలిని తట్టుకొనలేనివారు కొందరుందురు అందులకు కారణము ఆ వ్యక్తులలో పైత్యకోశము, (లివరు) సూర్యనాడి బలహీనపడుటయే. వేసవికాలములో వేడిని తట్టుకొన లేనివారు కొందరుందురు అందులకు కారణము, ఆ వ్యక్తులలో ప్లీహము, (స్ప్లీను) చంద్రనాడి బలహీనపడుటయే. మనపొట్టలో లివరు కుడివైపునను, స్ప్లీను ఎడమవైపునను మెత్తని కండరములతో కప్పబడి యుండును. మర్దన చికిత్సవలన ఈ రెండు ముఖ్య అవయవములు బలపడి శరీరము ఆరోగ్యవంతమగును.

పొట్టలో చిక్కిన కండరములను కూడా మర్దచికిత్స అద్భుతముగా బలపరచును కండరములే మన శరీరములోని ప్రధాన కర్మేంద్రియములు. అవి బలముగా లేకుంటే ఏ అవయవమూ సరిగా పనిచేయలేదు

మర్దనవలన నాడీమండలము బాగా చైతన్యవంతమగును. తక్కిన మండలములగు, రక్తప్రసరణ, బహిష్కార, జీర్ణ, శ్వాస, పునరుద్ధాన, మండలములు కూడ శక్తివంతమగును. మర్దనవలన చర్మకాంతి, సౌందర్యము హెచ్చుగును అయితే చర్మవ్యాధులు కలవారికి చేయుమర్దనలు రోగిహితవును గమనించి చేయవలెను బాధాకరములగు కొన్ని చర్మవ్యాధులలో రోగి తనంతట తానే మర్దన చేసికొనుట హితకరముగ నుండును "దురదలు గల చోట ఎవరంతటవారు గోళ్ళతో సహజముగ గోకుకొనుచు తృప్తి పడుచుందురు గోకుకొనుటకు కొందరు దువ్వెనలను, రబ్బరు, స్పాంజి,

పీచు, మెత్తకగుడ్డలను ఉపయోగింతురు. నూనె మర్దన సమయమునందు కూడ ఈ పరికరములు సహాయపడును ఇసుక, మట్టి, గరుకుదనముగల బొట్లు, పిండ్లుకూడ ఇందులకు ఉపయోగపడును తైలము స్నేహద్రవ్యములలో మేటి.

మర్దన చికిత్సలో శరీరమునందలి అవయవములలో సంకోచ వ్యాకోచములు వృద్ధియగును. శ్వాస అవయవముల ఉచ్ఛ్వాస నిశ్వాస మునకు కూడ మర్దన చికిత్స బాగా సహాయపడును శ్వాసావయవముల ఉచ్ఛ్వాసగమనము వివిధరకముల వ్యాయామ పద్ధతులవలననూ, ఆసనములవలనను కూడా క్రమబద్ధమగును ఇవన్నియు అన్యోన్యసహకారం సాధనలు కండర ములు బలపడుటకుగాను కుస్తీలు పట్టేవారు వ్యాయామముతోపాటు మర్దన బాగా చేయించుకొందురు. వారిలో వారు, ఒకరి నొకరు చేతులతో పిసికొంచు కొనుట, కాళ్ళతో తన్నుకొనుట, గుద్దించుకొనుట మున్నగు మర్దన చికిత్సా పద్ధతులను అనుసరింతురు. దంపతుల కామ విలాసములలో కూడా మర్దన స్పర్శన చికిత్సలకు సముచిత స్థానముగలదు.

చర్మము క్రియా ప్రతిక్రియా సామర్థ్యము యెక్కువగా గల అవయవము. దానిపై వేడి ప్రయోగము జరిగినప్పుడు అది శీతశక్తితో దానిని ఎదుర్కొనును. దానిపై శీత ప్రయోగము జరిగినప్పుడు అది ఉష్ణ శక్తితో దానిని ఎదుర్కొనును. దీనినే క్రియ, ప్రతిక్రియ యందురు. క్రియ, ప్రతి క్రియలయొక్క ప్రాబల్యమే బలారోగ్యములకు గీటురాయి. మర్దన చికిత్స ఈ ద్వివిధ శక్తులను పెంపొందించును

బాహ్య శరీరమునకు వ్యక్తిగతముగ చేయబడు మర్దన ఒకవిత్తు, అంతర శరీరమునందలి కండరములు, ఇతర అవయవములు, కణములు మున్నగువానికి ఉచ్ఛ్వాస నిశ్వాసముల ద్వారా జరుగు అనుక్షణ సహజ మర్దన ఒకవిత్తు. ఆరోగ్యరక్షణకు అంతర అవయవముల మర్దన చికిత్స పునాదివంటిది. బాహ్య మర్దన చికిత్స దానికి సహాయకారి వంటిది.

మర్దన వలన శరీరమునందలి ఉష్ణము సహజముగ ఎక్కువగును. కాన దానిని చలికాలములోను, చలిదేశములలోను విధిగా చేయవలసి యున్నది. అది దేశ, కాల, వ్యక్తి ప్రకృతులకు అనుగుణముగా నుండవలెను. మర్దనకు సహాయపడుటలో, పంచ మహాభూతముల కన్నింటికి ప్రత్యక్ష పరోక్ష సంబంధములు కలవు కాన సంపూర్ణ పాంచభౌతిక ప్రకృతి చికిత్సగా మర్దన గుర్తింపబడుచున్నది.

అన్నిరకముల వైద్య విధానములవారూ అందరు వ్యాయామ వేత్తలూ క్రీడలూ మర్దన చికిత్సకు తగిన గౌరవము నిచ్చుచున్నారు. మర్దన వలన దేహమునకు భార భూతముగనున్న ఘన, ద్రవ వాయు రూపములగు మాలిన్యములు బహిష్కరింపబడి శరీరము తేలికయై, విశ్రాంతి ననుభవింపను బడును. నాడుల యందలి ఉద్రేకములు, ఉద్వేగములు తగ్గి శాంతి లభించును. కీర్తి బలపడును

ఎవరంతట వారు స్వయముగా చేసుకొను మర్దన చికిత్సలో విశేష సత్ఫలము ప్రమాణముండదు. ఇతరులచే చేయించుకొను వానిలోనే వ్యయ, ప్రయాసలు కొన్ని యుండవచ్చును

మర్దన చికిత్సను ఇద్దరు మిత్రులు పరస్పరము శ్రద్ధా సక్తులతో చేసికొనుటవలన ఎక్కువ సత్ఫలితములు లభించును. మిత్రులు, కుటుంబసభ్యులు ఒకరికి నొకరు సహకార స్వాభావములతో మర్దన చేసికొనుట మంచి ఆరోగ్య నిర్మాణ కార్యక్రమము.

వైద్య పరిశోధకులు, మర్దన చికిత్సనే వృత్తిగా స్వీకరించి చేయువారు నున్నను వారిచే మర్దన చేయించుకొనుట రెండవపద్ధతి. అయితే వీరిలో ఒక ముఖ్యగుణము మర్దన చేయువారు అనారోగ్యవంతులుగాను దురభ్యాసములు కలవారుగను దుర్గుణ దాసులుగను ఉండకూడదు. అట్టివారు మర్దన చేయు

నపుడు వారి అనారోగ్యము, కామవికార, దురభ్యాసముల ప్రభావము, వారి రాజస తామస దుష్ట ప్రభావములు మర్దన చేయించుకొనేవారి ఆరోగ్యమునకు భంగము కలిగించును.

మర్దన చికిత్సను వ్యాపార పద్ధతిగా స్వీకరించి చేయువ్యక్తులు, సంస్థలు చికిత్సాకేంద్రములు ప్రపంచమంతటాగలవు.

సాత్వికులు సహజముగా ఇతరులచేత మర్దన చేయించుకొనుటకు ఇష్టపడరు. వారు అత్యవసర అనారోగ్య పరిస్థితులలో ఆప్తులైనవారిచేత మాత్రమే మర్దన చేయించుకొనుటకు ఒక్కొక్కప్పుడు ఇష్టపడవచ్చును. ఇది వారి సాత్వికమైన పద్ధతి.

రాజసులు, తామసులు అనారోగ్యమును కొనితెచ్చుకొనుచు, వారి బాధల నివారణకొరకు ఎంత ధనమైనను వెచ్చించి, పలువురివారిచే ఈ మర్దన చేయించుకొనుచుందురు. అది ఒక దురభ్యాసమై దానికి వారు దాసులగుదురు. కామ, ధన, మదాంధులలోను, సోమరులలోను ఇట్టి దురభ్యాసపరులు ఎక్కువగా యుందురు.

ఎవరికీ ఆరోగ్యభంగము కలుగకుండా ఇతరులచే మర్దన చేయించుకొనుటకు అనుకూలముగనుండు కొన్ని పరికరములుగలవు.

మర్దన చికిత్సకు సుమారుగ ఆరు అడుగుల పొడవు, రెండున్నర అడుగుల వెడల్పు, రెండున్నర అడుగుల ఎత్తుగల బల్ల ఒకటి ఉపయోగకారి. ఆ బల్లపైన ఒక ప్లాస్టిక్ టేబుల్‌క్లాత్ పరచుటవలన దానికి నూనె అంటినను సులభముగా దానిని కడిగి శుభ్రపరచ వీలగును. మర్దన చేయించుకొనువారు బల్లపై పరుండుదురు. మర్దన చేయువారు తమ కుడిచేతిప్రక్కన మర్దన చేయించుకొనేవారు పరుండునట్లు నిలిచి మర్దన చేయుదురు. వారు పరిశుభ్రమైన దుస్తులు ధరించి తరచు చేతులు కడుగుచుండవలెను.

ఆరోగ్యవంతులు పరస్పర మర్దనకు పరికరములను ఉపయోగించ నక్కరలేదు. బల్ల, అరుగు, వసతిలేకపోయినచో మర్దనకు చాపనైనా నేలపై పరచి ఉపయోగించుకొనవచ్చును. మర్ధన చేసేవారుగాని చేయించుకొనేవారుగాని అనారోగ్యవంతులైతే ఒకరి దోషము మరియొకరికి సోకకుండా కొన్ని పరికరములను ఉపయోగించవచ్చును. అవి రబ్బరుతోగానీ, నున్నితములగు ఇతర పదార్థములతోగానీ చేయబడిన చేతి తొడుగులు (గ్లోవుసు), కండరములకు మర్దన చేయుటకు అప్పడాలకర్రలవంటి వివిధ రకముల ఘర్షణ చక్ర పరికరములు, స్పాంజిబ్రష్‌లు, దువ్వెనలు, జల్లి స్నానపు పరికరములు, దూది, సున్నిత ఖద్దరు గుడ్డలు వేడిచేసిన కాపడపు సంచీ, ఇసుక, శుభ్రమైన పట్టి, నువ్వులనూనె, కొబ్బరినూనె, ఆలివునూనె, వేపనూనె, ఆవనూనె వంటి తైలములు వానిని సూర్యకిరణము వేయుటకు వివిధ రంగుల సీసాలు, నూనె వదిలించుటకు సున్నిపిండ్లు, సీకాయపొడి, కుంకుడుకాయలరసం వగైరా.

మర్ధన చికిత్సలోని మెళకువలు

ఆరోగ్య భాగ్యమును పెంపొందించుకొనదలచువారు ప్రతిరోజూ ఉదయం పెందలకడనే నిద్రలేచి కాళ్ళకూ, చేతులకూ నువ్వులనూనెను మర్దన చేసుకొనవలెను. అరికాళ్ళు, పాదములు మొదలు తొడలవరకు గల నరములు, గుండె, ఊపిరితిత్తులకు ఎక్కువ దూరముగ నుండు అవయవములు. వానికి గుండెనుండి ధమనుల ద్వారా ప్రవహించు రక్తప్రసరణ సాధారణముగా ఆరోగ్యవంతులలో సక్రమముగనే యుండును. కాని కొందరు రోగులలో దాని ప్రసరణ, గమనము మందముగగాని, తీవ్రముగ గాని ఉండవచ్చును. తిరుగు ప్రయాణములో శరీరపు చివరి భాగములనుండి ఊపిరితిత్తులకు శుద్ధిక్రియకొరకు చేరు కలుషరక్తము సరళముగా ప్రవహిం

చును ఈ రక్తప్రసరణ దిగువనుండి ఎగువకు చేరవలసియుండును. అది మేడమెట్లు, కొండ ఎక్కుటవంటి కష్టమైనపని ఆరోగ్యవంతులకు అది ఎక్కువ శ్రమగా తోచకపోవచ్చును గాని రోగులలో ఇది ప్రయాసదాయకముగా నుండును. సిరలద్వారా ఊపిరితిత్తులకు చేరు కలుషిత రక్తము అచట శుద్ధిపై గుండెకు అందించబడి మరల ధమనుల ద్వారా శరీరమంతటికిని పంచిపెట్టబడును. ఇదియొక వలయాకార సంచారం

చాలమంది రోగులలో సిరలు బలహీనపడును వానిని బలపరచుట ద్వారానే కలుషరక్తమును సంపూర్ణముగా ఊపిరితిత్తులకు పంపించగలము. ఇందుకుగాను పాదముల చివరలనుండి తొడల పై భాగమునకు గుండెవైపుగా చేయు మర్దన చికిత్స చాలా ప్రయోజనకారి.

మర్దన విధానములలోని ఘర్షణ క్రియ సిరలలో రక్తప్రవాహమును పెంపొందించుటకు బాగా సహాయపడును దీని తరువాత రోగి [illegible], అవసరమును బట్టి క్రిందన మర్దన విధానములను కూడ ప్రయోగించవలెను.

అట్లే చేతుల చివరల నుండి భుజములవరకూ కూడా మృదువుగా మర్దన చేయవలెను

ఇట్లు మర్దన చేయుటకు ఎక్కువ ప్రయోజనకారిగా నుండు పద్ధతులు ఈ క్రింద వివరింపబడినవి. కాళ్ళకు మర్దన చేయుటకై ముందుగా రోగి వెల్లకిలా చాపపై పరుండి కాళ్ళను వీలైనంతవరకు ఎత్తి బిగియించి ఆపుచుండవలెను లేదా ఒకదిండిపై గాని ఎత్తైన ఏ చోట గాని యుంచి రోగి వేలి కూర్చుని పాదముల చివరల నుండి గజ్జలవరకు మర్దన చేసినచో పాదాలనుండి గజ్జలవరకు చేరిన కలుషరక్తము అంతటి నుండి సులభముగా ఊపిరితిత్తులకు సిరలు ద్వారా ప్రవహించగలదు. ఇంకా [illegible] ఆ మర్దనను [illegible] పుకండరముల ద్వారా ఊపిరితిత్తుల నాళ [illegible] సాగించ

చెయ్యవచ్చును. ఇట్లు చేయుటలో ఇతరుల సహకారము అవసరమైతే పొంద వచ్చును

చేతులకు మర్దన చేయుటకు ముందుగా ఒక చేతిని పైకి ఎత్తి దానిని ఒక గోడకు ఆనించవలెను. ఆటుతర్వాత రెండవ చేతితో అరచేతి వద్ద నుండి భుజము ఇంకా అవసరమైతే ఊపిరితిత్తులవరకు ఘర్షణక్రియ ద్వారా మర్దన చేయవలెను

ఒక చేయికి మర్దన అయిన తిరువాత రెండవ చేతికి కూడా అట్లే మర్దన చేయవలెను. మర్దన అయిన తరువాత చేతిని క్రిందికి దించవచ్చును. ఈ సందర్భంలో కూడా అవసరమైనవారు ఇతరుల సహకారమును పొందవచ్చును.

కాళ్ళు, చేతులు అయిన తరువాత తలకు, మెడకు, కంఠమునకు, ముఖమునకు దూమెరుగుగా నూనెపూసి గుండె వైపునకు మర్దన చేయవలెను. ఇది రక్తప్రసారణ మండలమునకు సంబంధించిన మర్ధన చికిత్సా విధానము.

నాడీమండలమునకు చేయు మర్దన ముఖ్యముగా వెన్నుపామునకు సంబంధించి చేయవలసియుండును ఆ సమయంలో రోగి కూర్చుండవచ్చును. లేదా బోర్లపరుండవచ్చును ఈ చికిత్సకు ఇతరుల సహకారం అవసరమగును. దీనికి మర్దన, శిరస్సు వెనుకభాగమగు చిన్న మెదడు నుండి వెన్నుపూస చివరిభాగము వరకు (ముడ్డివరకు) చేయవలెను. ఈ మర్దన పైనుండి క్రిందికి ఎక్కువసార్లు చేయవలెను. మధ్య మధ్య క్రిందనుండి పైకి కూడా కొన్నిసార్లు చేయవలెను రోగిహితవు ననుసరించి వివిధరకములుగా చెప్పిన పద్ధతులు నాడీ మర్దన చికిత్సకు కూడా అవలంభించవలెను

ఉదరభాగం భుజములకు, ఊపిరితిత్తులకు, గుండెకు, జీర్ణాశయమునకు, మూత్రపిండములకు చేయుటకు జరుగు మర్దన ఒక వైపునుండి మరొక వైపునకు అటూ ఇటూ, ఇలా అలా అనేక విధములుగా హితవు ననుసరించి

ఎవరంతట వారు సులభముగా చేసికొనవచ్చును. మరి రోగదశలో నున్నవారు ఇతరులచేత చేయించుకొనవచ్చును

ప్రేవులు, మలకోశము, మూత్రకోశములలోని దోషములు పూర్తిగా బహిష్కరింపబడుటకుగాను ముందుగా బొడ్డులో నూనెవేసి ఆ భాగమంతా రుద్దుతూ చిన్నప్రేవులను పిసుకుతూ పైనుండి క్రింది వైపునకును, పెద్ద ప్రేవునకు కుడివైపు నుండి ప్రారంభించి ఎడమవైపునకును, మర్దన చేయవలెను. వీని మర్దనను ఎక్కువసేపు క్రింది భాగము పైకునకు చేసి అటు తరువాత కొద్దిసేపు దానికి వ్యతిరేక దిశకు కూడా చేయవలెను

ఈ విధముగా ప్రతివారూ ఉదయంపూట తైలమర్దన చేసికొనుట అత్యంత బలారోగ్య ప్రదాయకారి తైలమర్దన తర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని యోగాసనములను చేయుట అటుతర్వాత సంపూర్ణ స్నానము చేయుట బలవర్ధక క్రియలు

స్నానమునకు ముందుగా నూనె జిడ్డువదలిపోవుటకు చర్మ సౌందర్యమునకు సున్నిపిండితో నలుగు పెట్టుకొనవలెను. ఇందులకు పెసర, మినప, శనగ, బియ్యములతో తయారైన పిండి (దానిలో చేర్చబడు దావంచాలు, కస్తూరి పసుపు, వేపాకు రసము వేడినీరు కలిపిన నలుగుపిండి) ఆరోగ్యకరమైనది.

అటుతరువాత వేడినీటి స్నానం చేస్తూ నలుగుపిండితో గాని, సీకాయ పొడి, కుంకుడుకాయ రసములతో గాని ఒళ్ళు రుద్దుకొనుటవలన నూనె జిడ్డు పూర్తిగా వదలిపోవును.

మర్దన చికిత్స చేయించుకునే వారితోపాటు చేసేవారికి కూడా బలారోగ్యములు లభించును. మర్దన చికిత్సావసతులు ప్రతి ఆరోగ్యకేంద్రములోను యుండుట అవసరము. మర్దన చికిత్స పద్ధతులు సులభముగా

నేర్చుకొనదలచు వారికి ప్రత్యేక శిక్షణ కేంద్రములు, శిబిరములు ఏర్పాటు చేయుట అవసరముగ నున్నది.

ఇప్పుడు విజయవాడలోని ప్రకృతియోగ ఆరోగ్య కేంద్రము వారు ఈ రకమైన శిక్షణ శిబిరములను ఏర్పాటు చేయుచున్నారు. దీనితోపాటు యోగవ్యాయామ సాధనలలో కూడా వారు శిక్షణ ఇచ్చుచున్నారు. తైలాభ్యంజన స్నానము, మంగళస్నానముగా ప్రఖ్యాతిగాంచియున్నది. అది శుభకార్యములలోను పండుగలలోను మన ప్రాంతమున ఒక పద్ధతిగనున్నది.

మర్దన, యోగవ్యాయామ సాధనలు మంచి అలవాట్లు. ఇట్టి మంచి అలవాటు చేసికొనగలవారు అదృష్టవంతులు అట్లు చేయుటకు ప్రతిరోజూ వీలుపడనివారు కనీసం వారం రోజులకు ఒకసారైనా తగిన విరామంగల ఒకరోజున ఇట్టి మర్దన చేసికొనుట ఆరోగ్యవర్ధకము.

అనేకరకముల వృత్తులలో నిమగ్నులైనవారూ, గృహకృత్యములలో నిమగ్నులైనవారూ ఈ అలవాటు చేసుకొనుటకు తగిన శ్రద్ధ వహించుట లేదు. అందువలన వారి ఆరోగ్యము మెరుగుగా నుండుటలేదు ముఖ్యముగా రోలిక రోగులు ఈ అలవాటు తప్పక చేసికొనవలసియున్నది.

చిన్నపిల్లలకు తల్లిచేయు మర్దన చికిత్స, స్నానము, ఆదరణ, పోషణ, బలవర్ధకములు. ఇవి లభించనివారు బలహీనతకు గురికాక తప్పదు.

మర్ధన చికిత్సకు సంబంధించిన విషయములను గూర్చి ఎవరంతట వారు స్థిమితంగా ఆలోచించుకుంటూ సాధనచేయుట సులభము, ఆనందదాయకమూ దానికితోడు సుశిక్షణ పొందుట కూడా మంచిదే

మర్ధన చికిత్సచేయువారు వారితో చేయించుకొనువారూ ఆరోగ్యకరము బలవర్ధకములగు శాకాహారములనే తీసికొనుట మంచిది. మద్యపానము, మాంసాహారము ధూమపానము, వ్యభిచారము ఆరోగ్యరక్షణకు సహాయపడవు

ఉపవాస చికిత్స

ఉపవాసము అనగా ఇంద్రియ సంబంధమైన, విషయ వాసనలను దరిచేరనీయకుండా ముందుగా విరామ, విశ్రాంతులను తీసుకుంటూ అంతఃకరణ చతుష్టయమును, దైవసన్నిధిలో నిలుపుట (ఉపేసవతి ఇతి ఉపవాసః)

ఇంద్రియార్థగమనము అయాంతరమైనదిగాన దానిని వర్జించమన్నారు జ్ఞానులు.

ఉపవాసమునకు ముఖ్యాంగములు

1 విరామ, విశ్రాంతి, ఏకాంత వాసములు, 2 సత్సంగము, 3. ఆహార విహార నియమములు, 4 ఆసన యోగము

సాధారణముగా కొందరు ఉపవాసముంటే మామూలుగా రోజూ తినే ఆహారమును మాని తరుచు టిఫిను చేస్తూ, మంచి గాలిని పీలుస్తూ యుండటమేనని భావిస్తూ యుంటారు అయితే ఉపవాస చికిత్సలో ఒక పాదము మాత్రమే. తక్కిన మూడు పాదములు కూడ కలిసినదే పూర్తి ఉపవాస చికిత్స ఇది అధి వ్యాధులనే కాక దీర్ఘరోగములను కూడ కుదర్చు శక్తి గల దివ్యౌషధముగ ప్రఖ్యాతిగాంచినది (Fasting is the master remedy)

ఇట్టిదే లంఘనము కూడాను "లంఘనమ్ పరమౌషధమ్" అని ఆయుర్వేదం గుర్తించింది.

సాధారణముగా లంఘనము తరుణ వ్యాధులలో ప్రకృతిమాతచే విధింపబడుతుంది దాని ఆధారముగానే అవైట్య ఉపాసుణి రోగములను కుదురుస్తుంది

ఉపవాస చికిత్సను క్రమబద్ధముగా ఇతరులచే చేయించ సామర్థ్యము గలవారు సదాచారపరులగు వైద్యులే.

వైద్యులు జగన్మాత భక్తులు, వారు అనుసరించునది ధర్మము దానినే సదాచార మతము అని నిర్ణయించి పిలుచుచున్నారు

అట్టి అన్నిమతములవారును ఉపవాసమును వ్రతముగా నిష్ఠతో పాటించి జీవన్ముక్తులగుచున్నారు. వారికి దివ్యజ్ఞాన దివ్య జీవన పథములు.

ఆరోగ్యవంతులకే గాక కాలిక రోగులకుకూడా ఉపవాస చికిత్సవారికి ప్రయోజనకారి.

ఉపవాస సమయములోని ఆహార స్వీకరణ నియమములలో వ్యక్తుల యొక్క ప్రకృతి, ఆరోగ్యస్థితి, దేశ కాలములనుబట్టి కొన్ని తరతమ భేదములు క్రింది విధముగ నుండును నీటితో వాయుభక్షణతోనే గడుపునది శ్రేష్ఠము దీనినే నిర్జలోపవాసమందురు.

దీని తరువాతి ఉపవాసము జలోపవాసము. ఆ తరువాత ఫలరసోపవాసము, ఫలోపవాసము, క్షీరోపవాసము, పిష్టోపవాసము ఇట్టివే మరికొన్ని గలవు.

సద్గురువుల సద్వైద్యుల పర్యవేక్షణలో సాధకులు వీనిని చేయుట మంచిది

ఉపవాసములో విరామ విశ్రాంతి ఏకాంత వాసముల అవసరము చాల ఎక్కువగా నుండును

భక్తి భావముతో కూర్చుండుటగాని పరుండుటగాని చేయుటవలన సాధకుని శరీరముయొక్క శక్తి పెరుగును తద్వారా దేహమునందు పేరుకొని పోయిన మాలిన్యములు బహిష్కార అవయవముల ద్వారా సహజముగనే వెలువరింపబడును ఉపవాసాలములో జఠరాగ్ని ప్రజ్వరిల్లి శరీరము వేడి ఎక్కువగును తచ్ఛాంతికి చన్నీటిస్నానము ఉపయోగపడును చన్నీటిస్నానం సరిపడనివారు గోరువెచ్చని నీటిని స్నానపానములకు వాడవచ్చును

అప్పుడు మలమూత్ర కోశముల శుద్ధికొరకు తరచు మితముగా జల పానము చేయుచుండుట అవసరమగును.

మలబద్ధకవ్యాధిచే బాధపడువారు అవసరమునుబట్టి వస్తే (ఎనిమా) వాడవచ్చును కడుపునకు నూనె మర్దన చేయవచ్చును

ఈ కాలము ఆనందముగా గడుపుటకేగాను, సత్సంగము చాల అవసరము. సద్గురువుయొక్క భక్తిభావనాయుత మధురగానము సద్బోధ వాని శ్రవణము, ధ్యానము, శరీరమందలి శక్తిని పెంచును.

భక్తి భావనవలన ఆలోచనలు తగ్గుట, తద్వారా మనస్సు నిలుచుట క్రమముగా మనస్సు యోగము సిద్ధించుట, అద్వైతస్థితికి చేరువగుట తటస్థించును.

ఇవన్నీ ఉపవాసవ్రతము వలన కలుగు సిద్ధులు ఉపవాస వ్రతములు చేయుటకు, దేవాలయ ఆశ్రమ వాతావరణములు చాల మంచివి వాని వనము లలోని శీతల తరుచ్ఛాయలను సుగంధ పుష్పదృశ్యములు వాని సువాసనలు శరీరకమునకు లభించును మనస్సునకు ప్రశాంతతను ప్రసాదించును.

పూర్వకాలములో రాజర్షులు, బ్రహ్మర్షులు తాము, ఉపవాస వ్రతము లను నిష్ఠగా చేయుచు ప్రజలచే కూడా అనుసరింప చేసేవారు అట్లు ప్రతి పక్షములోను వచ్చు ఏకాదశీకోటను బట్టి ఉపవాసవ్రతము నాటితోపాటు సత్యనారాయణ వ్రతము, దానధర్మములు, సత్సంగ ఉపదేశాలు, హరి గారి కథా గానములు, నాగరిక పూజలు, ఉపాసనలు వారు ఆచరింపచేసేరు. అట్టి కార్యక్రమములు ప్రజలలో ధార్మిక శక్తిని పెంపొందించేవి.

ఇప్పుడు నిర్మాణ కార్యక్రమములుగా సమాజోద్ధరణకొరకు ఉపవాస వ్రత శిబిరములు సూర్యోపాసనా శిబిరములు సత్సంగ శిబిరములు మున్నగునవి నిర్వహింపబడవలసియున్నవి.

ప్రజలయొక్క సహకారము వీనికి సహజముగ ఎక్కువగనే యుండును. కాని ప్రభుత్వ సహకారం, సహాయములే వెనుకంజలో నున్నవి.

అందరి సహకారంలోను అవి ముందంజ వేయుటవలననే ధార్మిక కృషి జరుగగలదని నట్టను ం అభిప్రాయపడుచున్నారు. జగన్మాత అనుగ్రహము వలన మంచిరోజులు త్వరలో రాగలవని ఆశింతము. లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.

ప్రకృతి వైద్యులు ఉపవాస చికిత్సకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చుచున్నారు. గానిపై వివిధ భాషలలో వేలకొలది గ్రంథములు ప్రచురితమైయున్నవి జిజ్ఞాసువు లందరికీ ఉపవాస వ్రతము ఉపవాస చికిత్సలపై నిర్మాణాత్మకమైన అభిప్రాయములు గలవు ఎవరంతటవారు బహిర్ముఖ ప్రజ్ఞను తగ్గించుకొని అంతర్ముఖులైతే వారికి సకల సిద్ధులు లభింపగలవు. ఉపవాస చికిత్సలో స్వల్పకాలిక ఉపవాసములు ప్రమాదరహితములు అవి మూడురోజుల పరిమితి కలవిగా యుండును.

దీర్ఘోపవాసములు 40 రోజుల పరిమితిగలవిగా సాధారణముగా పరిగణింపబడుచుండును అంతకుమించిన ఉపవాసములు ప్రమాద భరితములు.

ఉపవాసము చేయుట సులభమే కాని దానిని ముగించి తిరిగి ఆహారమును తీసుకొనుటలో మెలకువగా లేకుంటే అది ఆరోగ్య భంగకారిగా తయారగును. రోగులలో దీని ప్రభావము మరీ ఎక్కువగా నుండును. ఉపవాస సమయములో కొందరిలో ప్రతిరోజూ సుమారు 1 కిలో బరువు తగ్గిపోవుట జరుగుచుండును ఒరి మాలిన్యము అయితే ఫరవాలేదు. కాని దేహములోని ఎముకలు, కండరములు క్షీణిస్తే వానిని తిరిగి పునః నిర్మించుటగాను మామూలు రోజులలో తినే ఆహారం కంటె ఎక్కువ మోతాదులో పౌష్టికాహారమును తీసుకొనవలసి యుండును. అట్లు తీసికొనవలసిన ఆహారము తగిన మోతాదుకు మించినచో అజీర్ణము, అగ్నిమాంద్యము అతిసారము. కడుపునొప్పి, మలబద్ధము మున్నగు బాధలు సంప్రాప్తము కావచ్చును.

అందువలన ఉపవాసము చాలించునప్పుడు తేలికగా జీర్ణమై బలము నిచ్చు ఫలరసములో కొంత నీరు కలిపి మెల్లగా త్రాగవలెను ఇట్టి రసమును మోతాదు క్రమముగా పెంచుతూ అవసరము బట్టి, రోగి తత్వమును బట్టి దానిని ప్రతి మూడుగంటలకు ఒకమారు ఇవ్వవచ్చును అటుతరువాత కొన్ని రోజులపాటు నీరు కలుపని పండ్లరసములను సుమారు 3 గంటల కొకసారి ఇవ్వవచ్చును అవసరమైతే పండ్లరసము లలో తేనెగాని, మంచి బెల్లము గాని కలుపవచ్చును.

వాత, శ్లేష్మతత్వము గలవారికి తాజాపండ్లరసములు హితకరముగ నుండక ఆరోగ్యమునకు భంగము కలిగినచో ఎండు ఖర్జూరపుపండ్లను నానబెట్టి పిసికి పిండి వడియగట్టిన మధురరసమును ఇవ్వవచ్చును ఎండు ద్రాక్ష పండ్లరసమును కూడా ఇవ్వవచ్చును [illegible] రాదా ఆవుపాలు గాని అవి లభ్యయున్నచో కాచిగాని ఇవ్వవచ్చును

కొందరికి వండిన కూరలు ఎసరుచేసి తీర్చి [illegible] నెయ్యివేసి లభ్యయుండి మరిగిపోయి దానిలో దుష్టవాయువు [illegible] కొందరికి అపానవాయువు గుండా పోయినా మరికొంత [illegible] అవి శిరోబాధలను, [illegible] భాగములకు వ్యాపించినచో [illegible] నొప్పులను కలిగించవచ్చును కాన అందరికీ వండిన [illegible] లో ఇచ్చు అలవాటు మంచిది కాదు దేహతత్వమును [illegible] ఆహారమును ఇవ్వవలెను.

వేడి వ్యాధులు కలవారికి కారము, చేదుగల పదార్థములు వగరు, వాటికి తీపి, పులుపు, ఉప్పు, వగరుకొద్ది [illegible] గమనించి ఇవ్వవలెను.

వాత, శ్లేష్మతత్వముల వారికి మిరియములు [illegible], ఏ [illegible] వాని చూర్ణము ఆహారపదార్థములలో మితము [illegible] ఇవ్వవలెను. లేక

చారులో ఆ పొడి వేయవచ్చును. ధనియాలపొడి జీలకర్రపొడి ఇవి వగరు రుచిగలవి కాని ఇవి అందరికీ హితకరముగ నుండును. కర్వేపాకు, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుకూరలు అందరికి మంచివే. వీనిని వండిన కూరలలో వేయవచ్చును.

కొంచెం ఎదిగిన వారికి గోధుమలు, రాగులు జొన్నలు, బియ్యము పప్పులాల వంటితో కాచిన జావ ఇవ్వవచ్చును ఇవి మెల్లగా త్రాగబడవలెను క్రమముగా రొట్టెగాని, అన్నముగాని వారి హితవుననుసరించి, కూర, చారు తోడావచ్చుట, పెరుగుతో వారి అలవాట్లను బట్టి రోజుకు రెండు పర్యాయములు ఇవ్వవచ్చును. ఎవరి ఆరోగ్యమును వారు పరిశీలించుకొనుచు ఆరోగ్యము చెడకుండా ఆహారమును స్వీకరించి బలపడవలెను

ఉపవాస సమయములో శరీరములో చేరిన ఘన, ద్రవ, వాయురూపక మలములు ఎక్కువగా బహిష్కరింపబడును అప్పుడు వానిని నిరోధింపరాదు అణచివేసే మందులను, ఇంజక్షనులను ఇవ్వరాదు శీత, ఉష్ణప్రయోగములు, విశ్రాంతులద్వారా అవి సులభముగా నివారణయగును

ఆ బాధలు కలిగించునంతటి మాలిన్యములు తగ్గిపోగానే వాటంతట అవే తగ్గిపోవును ఆ కాలములో విశ్రాంతి ఒక్కటే అన్ని సమస్యలను పరిష్కరించగలదు. ఆ విశ్రాంతిలోనే దేహప్రకృతి సరియైన వైద్యము చేయును ఇది ప్రకృతి చికిత్సగా వ్యవహరింపబడుచున్నది.

ఉపవాస చికిత్స పరివారం చేయబడు ఏ ఇతర చికిత్స అయినా దీని ప్రధానముగా [illegible] చేయును కాని ఉపవాస చికిత్స అన్ని చికిత్సలకు పునాదివంటిది అన్ని విధముల వైద్యవిధానముల వారిచే గుర్తించబడినది. అనుభవజ్ఞులగు వైద్యుల పర్యవేక్షణలో ఉపవాస చికిత్స జరుగుట శ్రేయోదాయకము.

ఉపవాస సమయములో [illegible], ఆ వ్యక్తి ప్రకృతిని గమనించి చన్నీటితో గాని, వేడినీటితోగాని స్నానము చేయించవచ్చును.

మౌన చికిత్స

కర్మేంద్రియములలో మొదటిది వాక్కు. అది ఆకాశతత్వ తన్మాత్ర యగు శబ్దమునుండి ప్రభవించినది ప్రణవనాదము నిశ్శబ్దములో నుండి ముందుగా పుట్టినదనీ క్రమముగా అది పంచప్రణవములుగా పరిణామము చెందినదనీ అటు తరువాత సప్తస్వరములు అక్షరములు ఏర్పడినవనీ, వాని ఆధారముగానే అనేక రకములగు భాషలు సంగీతములు గానములు ఏర్పడిన వనీ పరిణామ వాదము తెల్పుచున్నది.

వాక్కు యొక్క అధిపతి పేరు వాగ్దేవత. ఆమెను సరస్వతీదేవి అనికూడ పిలుతురు. వాక్కు త్రికరణములలో ప్రముఖమైన మధ్యవర్తి స్థానము కల్గియున్నది. (మనసా, వాచా, కర్మణా అనునవి త్రికరణములు) వీని ఏకత్వ, సహకార సాధననే త్రికరణశుద్ధి యందురు

శరీరములోని శక్తి వాక్కుద్వారా ఎక్కువగా ఖర్చగును మిత భాషణవలన శక్తిని [illegible] మితభాషణము కూడా ఒక రకమైన మౌనముగ పరిగణింప బడుచున్నది. అవసరమైనపుడే మితముగ మాట్లాడుట సదా చారము, శక్తిప్రదాయకము. మౌనవ్యాఖ్య శ్రేష్ఠమైనది. దానిలో ప్రసిద్ధుడు శ్రీదక్షిణామూర్తి గురుదేవుడు (మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్వమ్ .) మౌనమును స్వధర్మముగను సదాచారమును గుర్తించువారే మునులు.

మునులకుగల మహాశక్తికి ఆధారము మౌనమే. వారిలో శ్రేష్ఠులు మునీంద్రులు, మునిపుంగవులు, మునిరాజులుగ పిలువబడుచున్నారు.

సదాచార చికిత్సలలో మౌనమునకు ప్రముఖస్థానము గలదు. మౌనము వలన కలహములు నిరోధింపబడును. (మౌనేనకలహంనాస్తి) శక్తి

మిగులును. ఉపవాససమయములో మౌనము (మితభాషణము) ముఖ్యవిధి. అది యోగా రాధ స్థితికి మార్గదర్శి.

ఎక్కువగా మాట్లాడేవారు "(వాగుబోతులు) తిండిపోతులు, త్రాగుబోతులు అయివుంటారు

అధిక తిండి, అధిక త్రాగుడు, వాని ఉద్రేకముల వలన అధిక వేడి, అధికగాలి ఉత్పన్నమగును. వాని తీవ్రచలన ప్రభావము వలన వాగింద్రియము ముందుగా ప్రకంపించి వాగుడు ప్రారంభమగును తరువాత ఇంద్రియములు, శరీరము వూగుట ప్రారంభమగును ఇవి కలహాములను, హత్యాకు కారణమగు ఉను శరీరము ఉద్రేకము ఉద్వేగము కలుగును. అవి అన్ని కర్మేంద్రియములనూ, జ్ఞానేంద్రియములనూ అంతఃకరణమును ఎక్కువగా చలింపచేయును ఆస్థితిలో మనస్సు అదుపుతప్పి తప్పిదములను చేయును నేరస్వభావము, ఆల్లర్లు, హత్యాప్రవృత్తి అధికమగును ఇదే నేటి నాగరిక ప్రపంచ స్వరూపం, స్వభావముగా రూపొందినది. వీని అన్నింటికి మూలము తిండిపోతుతనము, త్రాగుబోతుతనములే గాన దానిని తగ్గిస్తే నేరప్రవృత్తి తగ్గిపోతుంది. ప్రభుత్వము దీనిని స్వార్థ రహిత దృష్టితో గుర్తించి సంస్కరణలను నెలకొల్పాలి. లేకుంటే అది తీవ్ర అశాంతికి కారణమౌతుంది.

సంగీత చికిత్స

"సంగీత జ్ఞానము, భక్తివినా మోక్ష సామ్రాజ్యముగలదే" అని గానము చేశారు త్యాగబ్రహ్మగారు. భక్తి సంగీతము సాత్వికము, సప్త స్వర సమన్వితము అయినది. అది బ్రహ్మానంద విభూతి సంపన్నమైనది.

అది భావ, రాగ, తాళ, సంయుతమైనది. అది సంసార సాగరమును తరింపచేసే విశ్వేశని దాంటుట దీర్ఘనౌక వంటిది. భక్తి ప్రభావితమైన

సంగీతమే దివ్యరోగ నివారక శక్తి గలది. భగవన్నామస్మరణలు సర్వ రోగ శాంతికరములు

సంగీతము ఒక గొప్ప కళ.

ఆ కళాకారులు వందనీయులు.

"ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు" అనే కీర్తనలో త్యాగ బ్రహ్మగారు భక్తి సంగీత కళాకారులకు వందన సమర్పణ చేసి ఆనందించారు అది అందరికీ శిరోధార్యమైన దివ్యసందేశము భక్తి సంగీతములో పరవశించే భక్తులకు ఆరోగ్యములు కరతలామలకములు. వారి ఆహార,విహారనియమములు సదాచార సంపత్తులు వారికి రక్షగాయుంటవి. నేర్చుకుంటే భక్తి సంగీతమే నేర్చుకుంటారు. సత్వగుణ ప్రధానులు వారు మితాహారులు, సజ్జనులు, ఆదరణీయులు, జీవన్ముక్తులు.

నృత్య చికిత్స

నృత్యము భక్తితోకూడిన సాత్విక వ్యాయామ కళ. భక్తిలేని వ్యాయామ కళ రాజస, తామస, మిశ్రమ ప్రభావితమైనది. అది నాట్యముగా గుర్తింపబడుచున్నది దానిని ఆంగ్లభాషలో డ్యాన్సు అంటారు ఇది నేటి సినిమాలలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించి కొందరిలో ఒకరకముల కామ వికారములను కలిగించుచున్నది. ఇందుకు పావులుగా స్త్రీలు, యువతులు ఎక్కువగా ఎన్నుకొనబడుచున్నారు. వారి అర్ధ దిగంబర నాట్యభంగిమలు యువకుల మనస్సులను ఆకర్షించి వారి మతులను చెడగొట్టుచున్నవి. కేబరే డ్యాన్సులు, దొమ్మరి నాట్యాలు ఇటువంటివి ఎన్నెన్నో సమాజములో అమలు జరుగుచున్నవి. యువకులు యువతులతో జతగా కలిసి బహిరంగ ముగ దిగంబర నాట్యాలు చేస్తూ, కళాకారులనే బిరుదులు పొందుతూ,

అధికముగ ధనమును సంపాదించి సా గాసీసాలు ఖాళీచేసి ప్రభుత్వ ఖజానాను యథాశక్తి పెంపొందిస్తున్నారు

నాట్యములు నటనతో కూడినవి. నటనలు యదార్థములు కావుగదా ! నృత్యము సాత్వికము, భక్తి సంపన్నము, కామ రాగ వివర్జితము అయిన దివ్యకళ. భక్తితో పరవశులై నృత్యము చేస్తూ తరించేవారు జీవన్ముక్తులుగా గుర్తింపబడుచున్నారు ఈ దివ్యకళకు ప్రఖ్యాతిగాంచిన దేవుడు శివుడు శివతాండవ నృత్యము ఒక దివ్యానుభూతి నృత్యము సర్వరోగహరము మాత్రమే కాక సకసిష్టి ప్రదము. సంగీతము నృత్యము ప్రకృతి పురుషుల విభూతులు. వీనిని అలవాటు చేసికొనుట శ్రేయస్కరము ఇవి దివ్యౌషధములు. వీని సంస్మరణ శాంతిదాయకము.

విశ్రమణ చికిత్స

విశ్రమణము అనగా విశ్రాంతి. విరామము దీనిలో ఒక భాగము నివృత్తి దీని అధిదేవత.

అధిక శ్రమవలన ఆయాసము కలుగును అట్టి ఆయాసము తొలగి పోవుటకు అత్యుత్తమ చికిత్స విశ్రాంతియే ..విశ్రాంతిలోనే దేహశక్తికి సకలరోగములను కుదిర్చే అవకాశం లభిస్తుంది ఈ సమయంలో దేహ ప్రకృతి చేసే చికిత్సయే ప్రకృతి చికిత్సగా గుర్తింపబడుచున్నది అన్ని రకముల వైద్యములవారూ ఈ సత్యమును గౌరవించి రోగియొక్క పూర్తి విశ్రాంతి కొరకు వైద్యశాలలో పడక (మంచము)లను ఏర్పాటు చేసినారు. ఆసుపత్రులలో కొన్ని పడకలుండును (మంచములు) పడకల సంఖ్యనుబట్టి ఆసుపత్రియొక్క స్థాయి నిర్ణయింపబడును

స్వంత గృహములలో కూడా విశ్రాంతి తీసుకొనుటకు వివిధ రకములైన మంచములు అరుగులు, బల్లలు, చాపలు, పరుపులు ఉండును. ఒక్కొక్కరికి ఒక్కొక్క దానిపైన పడుకుంటేనే నిద్రబాగా పడుతుంది.

విశ్రాంతి చిక్కి బలము కలుగుతుంది. అలవాటు లేని ప్రక్కమీద పరుంటే కొందరికి నిద్రపట్టదు. బలము, విశ్రాంతి, ఆరోగ్యమూ లభించవు. అదివారి అలవాటు. కొంతమందికి చాపమీద పరుంటేనే నిద్రపడుతుంది. దానిని అధఃశయనము అంటారు. వారికి ఏ మంచంమీద పడుకున్నా నిద్రపట్టదు. బ్రహ్మచర్యమును పాటించేవారికి అధఃశయనమే అనుకూలమైనది.

ఆరోగ్యదశలోనూ, అనారోగ్యదశలోను ఎవరికివారు, వారికి హితవుగ నుండు పడకనే ఏర్పాటు చేసికొనవలెను. గ్రామీణులు నిద్రవచ్చినపుడు ఏ బండరాయి మీదనైనా పడుకుని గాఢనిద్రపోతారు. కాని భోగలాలసులకు ఆ యోగ్యత వుండదు. కొందరికి చెట్టుక్రింద పడుకుంటేనే హాయిగా ఉంటుంది. వారిని తీసుకుని వెళ్ళి మంచి మేడలో ఫ్యానుక్రింద మంచముమీద పరుపుపై పడుకోపెడితే అతనికి విశ్రాంతి చిక్కదు. కాబట్టి ఎవరికి అనుకూలమైన పడకపైననే వారిని విశ్రాంతి తీసుకొననివ్వవలెను. కొంతమందికి ఏకాంతముగా పడుండుట హితవుగా వుంటుంది. మరికొందరికి ఎక్కువ జనసమూహము సందడిగలచోట పడుండుట హితవుగా ఉంటుంది. ఎవరికి అనుకూలమగు అలవాట్లకు తగినట్లుగానే వారు ప్రవర్తిస్తూ యుంటారు. పెద్ద పెద్ద ఆసుపత్రులలోని, జనరల్ వార్డులలో పెద్ద ఇనుప మంచాలూ, దానిపైన పరుపులూ, దిండ్లూ, ఇతర వసతులూ ఉంటాయి. వారివారి ప్రత్యేక మంచాలపైన చాలమంది రోగులు ఒకే హాలులో వరుసగా పడుకుని ఉంటారు. వారివారి బాధలు పక్కవారికి వినబడుచూ కనబడుచూనే ఉంటాయి. కొందరికి ఆ వాతావరణము సరిపడదు. అచట వారికి విశ్రాంతి చిక్కదు. కాన వారు బయటకుపోయి చెట్టుక్రింద పడుకుంటామంటారు. అందుకు వైద్యులు, నర్సులు ఒప్పుకోరు. అట్టి రోగుల రోగం కుదరదు. అది విశ్రాంతి లోపమువలననే. స్వం ఇంట్లో సుఖముగా ఉంటుంది. చాల మందికి అది వారి అలవాటు. ఆసుపత్రిలోని కొందరు రోగులకు అదొక కారాగారములాగా తోస్తుంది. అందువలన ఆసుపత్రులంటే భయపడేవారు

చాలమంది ఉంటారు కాబట్టి వారు ఇంటివద్దనే యుండి వైద్యం చేయించు కొంటుంటారు చాలా దేశాలలో ఇంటివద్దనే యుండి చికిత్సలు చేయించు కొన్తారు వారికి సహాయపడే వైద్య ఏర్పాట్లు గలవు ఇంటివద్దగ్గర వసతి లేనివారికి మాత్రం ఆసుపత్రులలోని వ్యయప్రయాసలు తప్పవు.

విశ్రాంతి కావాలి అంటే ఎల్లప్పుడూ మంచంమీదనే పరుండి యుండ నవసరములేదు రోజులో 8 గంటలకంటే సామాన్యంగా ఎక్కువసేపు ఎవరికీ నిద్రపట్టదు తక్కినసేపు కూర్చుండుట, తిరుగుట చేస్తూయుంటే గాని విశ్రాంతి వారికి చిక్కదు. కొన్ని ఆసుపత్రులలో అది సరిగా కుదరదు కొందరికి ప్రామిత'కి నిద్రబాగా పడుతుంది. విశ్రాంతి కూడా లభిస్తుంది. రోగులు శ్రమచేయలేరు కొందరికి సరిగా నిద్రపట్టదు. కాన వారికి కొన్ని చికిత్సలు చేయవలసి యుంటుంది. కొందరు వైద్యులు నిద్ర పట్టని వాళ్ళకు మత్తుమందులు వాడుతూ యుంటారు కాలక్రమేణా అవి రోగాన్ని బాధనూ ఎక్కువచేస్తూ వుంటాయి.

అట్టివారికి విశ్రాంతి లభించుటకుగాను, మర్దన చికిత్స యోగ వ్యాయామ సాధనలు, యోగాసన ప్రాణాయామ ధ్యాన సాధనలు, వేడినీటియా పాద స్నానములు విశ్రాంతిని ప్రసాదించగలవు. ఆహార విహారములలో నియమములు, స్నానములు, సత్సాంగము సత్సహవాసము, సద్గ్రంథ శ్రవణము ఎక్కువగా విశ్రాంతి నివ్వగలవు కొంతసేపు అధికశ్రమ గల పని చేసి అలసిన వారికి తరువాత కొంత విశ్రాంతి తీసికొని అంతకంటె తక్కువ శ్రమగలపని చేయుటకూడా కొంత విశ్రాంతియే. దీనిని పని మార్పు అంటారు మానసిక ఆందోళన గలవారికి విశ్రాంతి చిక్కదు కాన అవితగ్గే ప్రయత్నము చేయాలి సత్సాంగత్యము, యోగసాధనలు విశ్రాంతికి మంచి మిత్రులు.

సత్సంగ చికిత్స

శ్లో. సత్సంగత్వే నిస్సంగత్వమ్
నిస్సంగత్వే నిర్మోహత్వమ్
నిర్మోహత్వే నిశ్చలతత్వమ్
నిశ్చలతత్వే జీవన్ముక్తిః
ఇది భజగోవింద శ్లోకము

సత్సంగమునకు మించిన దివ్యౌషధము వేరేదీలేదు ప్రకృతి శక్తులకు వాని విభూతులకు సన్నిహితముగ నుండుటయే సత్సంగము చెట్లకు సమీపమున యుండుట, సజ్జనులతో కలసియుండుట, సదాచారము కలిగియుండుట, ఉపాసన, ధ్యాన, సంకీర్తన భజనశ్రవణ, మనన, నిధిధ్యాసలు కలిగియుండుట, త్రికరణశుద్ధిగా జీవించుట,ఆహార విహారములలో విధి నిషేధములను గమనించి ప్రవర్తించుట, సమాజక్షేమమే తన శ్రేయస్సుగా భావించి సత్యదీక్షతో నీతిగా ప్రవర్తించుట, తనను తాను తెలిసికొనుటకు అంతర్ముఖులగుట, సత్యము, అహింసలను, పాటించుట, సాధన చతుష్టయ సంపత్తి కల్గియుండుట మున్నగు సత్సంగ సాధనలే దివ్యజీవన సోపానములు. అవే శాంతి దాయకములు.

ప్రకృతి వైద్య విధానము

గ్రంధకర్త జీవిత పరిచయము

(చదువు, సంస్కారము, సేవ, గుర్తింపు)

1. నామధేయము 1 వంశీయము అవినారాయణశర్మ - కొలిపాక

   2. సామాజికము ఆచార్య ప్రకృతి శర్మ.

2. గోత్రము భారద్వాజస (త్రయా ఋషేయము)

3. దేశము . ఆంధ్రప్రదేశము

4. కాలము 20 వ శతాబ్దము జననతేదీ 1-7-1915.

5. ప్రకృతి (స్వభావము) అభిరుచి ప్రకృతి పురుష ఉపాసన.

6 వర్ణము (గుణ, కర్మ, జన్మ, ప్రభావితము) బ్రాహ్మణ

7. ఆశ్రమము (సంస్కార సమన్వితము)

   1. బ్రహ్మచర్యము. 1923 నుండి 1943 వరకు
      ఉపనయన సంస్కారానంతరము

   2. గృహస్థము. 1944 నుండి 1974 వరకు
      వివాహ సంస్కారానంతరము.

   3. వానప్రస్థము. 1975 నుండి 1987 వరకు
      షష్టిపూర్తి సంస్కారానంతరము.

8. ధర్మము విశ్వజనీన మత ధర్మానువర్తనము.

[illegible]